ప్రజాశక్తి
బుధవారం 18 డిసెంబర్ 2024
5
శ్రీ సత్యసాయి



## పౌరసరఫరా శాఖ అధికారుల దాడులు

### 48 కింటాళ్ల బియ్యం, 30 సిలిండర్లు సీజ్

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

శ్రీ సత్యసాయి జిల్లా పౌరసరపాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కదిరి పట్టణంలో దాడులు నిర్వహించారు. పట్టణంలోని పలు హోటళ్ల యాజమాన్యాలు వాణిజ్య సముదాయానికి వినియోగించే సిలిండర్లు కాకుండా గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లు వినియోగం చేస్తున్నట్లు ఫిర్యాదులు రావటంతో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈసందర్భంగా 30 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా కదిరి సమీపాన ఓ గోడౌన్ లో అక్రమంగా నిలువ ఉంచిన 48 కింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ దాడులలో పౌరసరరాల సిఎస్‌డిటిలు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

# బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

## కలెక్టర్ టిఎస్.చేతన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేలా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సూచించారు. మంగళవారం నాడు కలెక్టరేట్లో కలెక్టర్ అధ్యక్షతన రాష్ట్ర యునెసెఫ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కలసి పనిచేయాలన్నారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు బాల్య వివాహాల నిరోధక చట్టంపై శిక్షణలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యునెసెఫ్ ప్రతినిధి మురళీకృష్ణ, మహేష్, బిసిపిఒ శాంత మని, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

**ఇంధన పొదుపుతూనే భవిష్యత్**

ఇంధన పొదుపుతోనే భవిష్యత్ ఉంటుందని ప్రతి ఒక్కరూ పాటించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. మంగళవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ర్యాలీని విద్యార్థులు, విద్యుత్ శాఖ అధికారులు పుట్టపర్తి విద్యాగిరి నుంచి ఎనుములపల్లి గణేష్ కూడలి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఇంధన పొదుపుపై అవగాహన కలిగించే పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ ఆదా చేయడం ద్వారా భావితరాలకు మంచి భవిష్యత్‌ను ఇచ్చినవారం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్రబాబు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలి**

పిఎం సూర్యఘర్ పథకంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో కలెక్టర్ అధ్యక్షతన ఉచిత విద్యుత్ కోసం ఉద్దేశించిన రూఫ్‌టాప్ సోలార్ సిస్టం పిఎం సూర్యఘర్ మఫ్త్ బిజిలి యువజన అమలుపై డిఎల్‌సి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ డీసీఎల్ ప్రతినిధి ఎస్ఇ సురేంద్రబాబు సాంప్రదాయ ఇంధన వనరుల అధికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల అధికారి సుధాకర్ రెడ్డి, నైపుణ్య అభివృద్ధి అధికారి హరి కిరణ్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

**విరివిగా మొక్కలు నాటాలి**

జిల్లాలో అటవీ శాఖ ద్వారా 35 లక్షల నర్సరీల ద్వారా మొక్కలు నాటే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉపాధి హామీ పనులు, నగరవనం సుందరీకరణ, మొక్కలు నాటే కార్యక్రమం తదితర అంశాలపై కలెక్టరేట్లో అటవీ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 50 శాతం పచ్చదనం సాధించే దిశగా అటవీ, రెవెన్యూ అధికారులు నిర్దిష్ట ప్రణాళిక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నియోజక వర్గానికి ఒక నగరవనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అటవీ శాఖ జిల్లా అధికారి చక్రపాణి, సామాజిక వన విభాగం అధికారి వినోద్ కుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

# గురుకులంలో విద్యార్థినులకు అస్వస్థత



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

- చికిత్స అనంతరం కోలుకున్న విద్యార్థినులు
- ఘటనపై మంత్రి సవిత ఆరా
- మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఆదేశం
- పాఠశాలను పరిశీలించిన డిఎంహెచ్ఒ

**ప్రజాశక్తి-పెనుకొండ**

పెనుకొండ మండలం రాంపురం వద్ద ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థినులు సోమవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపల్ జమున, సిబ్బంది 13మంది విద్యార్థినులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. చికిత్స అనంతరం మంగళవారం ఉదయం విద్యార్థినులు గురుకుల పాఠశాలకు వెళ్లారు. ఆదివారం రోజున విద్యార్థినుల తల్లిదండ్రులు తీసుకువచ్చిన తినుబండారాలను తినడం వల్లే స్వల్ప అస్వస్థతకు గురయ్యారని గుట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నాగరాజు నాయక్ తెలిపారు. 6వ.తరగతి చదువుతున్న మహేశ్వరి మూడురోజులుగా జ్వరం తో బాధపడుతోందని విద్యార్థికి చికిత్స అందించామని ప్రస్తుతం కోరుకుంటోందని ఆయన తెలిపారు.

**పాఠశాలను పరిశీలించిన డిఎంహెచ్ఒ**

విద్యార్థినులు అస్వస్థతకు గురి అయ్యారని తెలుసుకున్న శ్రీ సత్యసాయి జిల్లా వైద్య అధికారిని మంజు వాణి మంగళవారం రాంపురం వద్ద ఉన్న ఎంజెపి గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వంటశాలను కూరగాయలను సరుకులను పరిశీలించి సూచనలు చేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అదేవిధంగా పెనుకొండ తహశీల్దార్ శ్రీధర్, ఎంఇఒ సుధాకర్ తదితర సిబ్బంది గురుకుల పాఠశాలను పరిశీలించి విద్యార్థులను ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

**హాస్టళ్లలోకి బయట ఆహారం రానివ్వొద్దు :మంత్రి సవిత**

రాష్ట్ర వ్యాప్తంగా బీసీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లోకి బయట ఆహారాన్ని తీసుకురానివ్వొద్దని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం రాంపురం బీసీ గురుకుల పాఠశాలకు చెందిన 13 మంది బాలికలు స్వల్ప అసస్థతకు గురైన నేపథ్యంలో పెనుకొండ ఆస్పత్రిలో చికిత్స అనంతరం మంగళవారం ఉదయం వారిని డిశ్చార్జి చేశారు. విషయం తెలుసుకున్న మంత్రి విద్యార్థినులు, వైద్యులు, గురుకుల పాఠశాల సిబ్బందితోనూ ఫోన్లో మాట్లాడారు. కలుషిత ఆహారం తీసుకోవడం వల్లే విద్యార్థినులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారని వైద్యులు మంత్రికి తెలిపారు. విద్యార్థినులంతా కోలుకున్నారని, వారిని డిశ్చార్జి చేశామని వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం హాస్టల్‌లోనే విద్యార్థినులు విశ్రాంతి తీసుకుంటున్నట్లు సిబ్బంది తెలిపారు. బాలికలను డిశ్చార్జి చేసినా హాస్టల్ లోనే వైద్యుల పర్యవేక్షలోనే ఉంచాలని, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితిపై నివేదికలు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. గురుకుల పాఠశాల్లోని మిగిలిన విద్యార్థినుల పరిస్థితిపైనా మంత్రి ఆరా తీశారు. వారంతా ఆరోగ్యంగా ఉన్నారని ఆదివారం కావడంతో హాస్టల్ చుట్టు పక్కల ఉన్న షాపుల నుంచి ఆహార పదార్థాలను కొనుగోలు చేసి విద్యార్థినులు తిన్నారని తెలిపారు. అటువంటి వారే అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. దీనిపై మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు చేశారు. హాస్టల్ లోకి బయట ఆహారం తీసుకురానివ్వొదని ఆదేశించారు. విద్యార్థినులను ఎట్టి పరిస్థితుల్లోనూ హాస్టల్ నుంచి బయటకు వెళ్లనీయొద్దని మంత్రి సవిత ఆదేశించారు.





ఇంధన పొదుపుపై నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

## ఇంధన పరిరక్షణ అందరి భాధ్యత

### ఈఈ భూపతి

**ప్రజాశక్తి-హిందూపురం**

ఇంధన పరిరక్షణ అందరి భాధ్యత అని విద్యుత్ శాఖ ఈఈ భూపతి తెలిపారు. జాతీయ ఇంధన సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలో గహ, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు, వ్యవసాయ రంగాల్లో ఇంధన పొదుపు చిట్కాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అవగాహన ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ వీడీ రోడ్డులోని పవర్ హౌస్ కార్యాలయం నుంచి ప్రారంభమై గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా ఉన్న డిఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ బొగ్గు, గ్యాస్, క్రూడ్ అయిల్ లాంటి ఇంధనాలు ఇప్పటికే అతి వేగంగా తరగిపోతున్నాయన్నారు. వీటిని భాధ్యతగా వాడాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సూర్యఘర్ పథకంపై వివరించి, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిఈఈలు నాగన్న, జ్యోష్నా, ఎఈలతో పాటు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాలుగు రోజుల పాటు ఆధార్ క్యాంప్



పాఠశాల నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపు

**ప్రజాశక్తి-హిందూపురం**

లేపాక్షి మండల పరిధిలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయులు సుబ్బారావు ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు ఆధార్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసులు తెలిపారు. ఈ క్యాంప్ 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. నూతన ఆధార్ కార్డు, ఆధార్ అప్డేట్, ఫోన్ నెంబర్లు మార్పు, అడ్రస్, పేరు మార్పు తదితర మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంకాలం 5 గంటల వరకు ఆధార్ క్యాంప్ కొనసాగుతుందన్నారు.

## మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు





.సదస్సులో మాట్లాడుతున్న వైద్యురాలు అనూషా రెడ్డి

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాలలో మహిళా విద్యార్థుల కోసం పట్టణంలోని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అనూష రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, సర్వైకల్ క్యాన్సర్ నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష రెడ్డి మాట్లాడుతూ మారుతున్న నేటి జీవన విధానాల వల్ల గత కొన్ని దశాబ్దాల కాలంగా మహిళలు చాలా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కౌమార దశలోకి ప్రవేశించిన అమ్మాయిల నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళలకు స్వదేశంలో తయారు చేసిన వ్యాక్సిన్లను ఇవ్వడం ద్వారా భవిష్యత్‌లో ఉత్పన్నమయ్యే దుష్ప్రభావాల నుండి కాపాడవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా నేటి మహిళలు తీసుకోవాల్సిన ఆహార నియమాలు, జీవన విధానాలు, శుభ్రత పరిశుభ్రతలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి బైసాని రాంప్రసాద్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.నాగేంద్ర కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జెఎస్‌విఎస్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాగు రైతుల భూములకు హద్దులు ఏర్పాటు

**ప్రజాశక్తి - రొద్దం**

మండలంలోని కోగిర రెవిన్యూ పొలంలో ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న సాగుదారుల భూములకు సర్వే అధికారులు మంగళవారం హద్దులు ఏర్పాటు చేశారు. సర్వే టీం లీడర్ సురేష్ ఆధ్వర్యంలో 8 టీములుగా సర్వే అధికారులు, సాగుదారులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ సాగుదారులు దశాబ్దాలుగా ఈ భూమిపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రస్తుతం అధికారులు స్పందించి సర్వే చేయడం ద్వారా రాబోవు కాలంలో భూమి మీద హక్కులు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సాగు భూముల సాధన పోరాట కమిటీ నాయకులు అనిత, రామాంజినమ్మ, రత్నాబాయి, కళావతిబాయి, చిన్న అంజినప్ప, కత్తుల నరసింహప్ప, నిర్మల, ఆదినారాయణ, శంకర, అనిత, శ్రీరాములు తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



హద్దుల ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, రైతులు, అధికారులు

# సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి : సిఐటియు



భవన నిర్మాణరంగం నూతన కమిటీ సభ్యులతో నాయకులు

**ప్రజాశక్తి - గోరంట్ల**

సంక్షేమ బోర్డును ప్రభుత్వం పునరుద్ధరించి పెండింగ్లో ఉన్న క్లైములకు నిధులు విడుదల చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కూరగాయల మార్కెట్‌లో మంగళవారం భవన నిర్మాణ కార్మికుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ 12 14 మెమోను తీసుకురావడం వల్ల భవన నిర్మాణ కార్మికులకు నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగం భవన నిర్మాణ రంగానిది అని అన్నారు. ముడి సరుకుల విషయంలో ప్రభుత్వ వైఫల్యం వల్ల నిర్మాణ రంగం కుదేలైందన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలను కొనసాగించాలన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐ శేఖర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు పోలీసుశాఖ తనవంతు సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, కోశాధికారి ముత్యాలు, నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్, కార్మిక సంఘం జిల్లా నాయకురాలు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు

**భవన నిర్మాణ నూతన కమిటీ ఏర్పాటు**

ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల మండల కమిటీని ఏర్పాటు చేశారు భవన నిర్మాణ మండల కమిటీ అధ్యక్షులుగా మహబూబ్ బాషా, మండల ప్రధాన కార్యదర్శిగా ముద్దల వెంకటరమణ, కోశాధికారిగా బాబ్జాన్‌తో పాటు 20 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని అన్నారు.

# శిథిలావస్థలో తహశీల్దార్ కార్యాలయ భవనం

**ప్రజాశక్తి - నల్లమాడ**

మండలకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. 1997 సంవత్సరంలో నిర్మించిన తహశీల్దార్ కార్యాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. ఈ కార్యాలయం పై కప్పు పెచ్చులూడి వర్షం వస్తే కార్యాలయం లోపల భాగంలో నీరు చేరి రికార్డులు దస్తావేజులు తడిసిపోతుండడంతో తహశీల్దార్ కార్యాలయాన్ని తాత్కాలికంగా ఎస్సీ హాస్టల్ భవనంలోకి మార్చారు. ప్రస్తుతం ఈ కార్యాలయానికి చేరుకోవాలంటే దాదాపు రెండు కిలోమీటర్లు దూరం వెళ్లాల్సిన వస్తుంది. వికలాంగులు, వృద్ధులు అక్కడికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలో వెళ్లాలంటే ఖర్చులు పెరిగిపోతున్నాయి. అందరికీ అందుబాటులో రోడ్డుకు ఆనుకొని ఉన్న పాత భవనాన్ని మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న పాత తహశీల్దార్ కార్యాలయ గోడలపై పిచ్చి మొక్కలు మొలచి మరి దారుణంగా మారింది. ఉన్నతాధికారులు దృష్టి సారించి శిథిలావస్థకు చేరిన భవనాన్ని మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.





శిథిలావస్థకు చేరిన తహశీల్దార్ కార్యాలయ భవనం



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి

## మంచిగా మెలగాలి

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

ఖైదీలు మంచిగా సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయాధికారి శివ ప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని స్థానిక సబ్ జైలును. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శివ ప్రసాద్ యాదవ్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాలు పూర్తి అయిన నిందితులు, అనారోగ్యముతో బాధపడుతున్న నిందితులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సత్ప్రవర్తన ద్వారా జైలు జీవితం నుండి విడుదలై కుటుంబ సభ్యులతో కలిసి మెలిసి జీవించాలన్నారు. ఈసందర్భంగా వంటశాల, గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు లింగాల లోకేశ్వర్ రెడ్డి, దశరథ నాయక్, సిరాజుద్దీన్, రఘునాథ్, సూపరింటెండెంట్ వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు 'మంగళకర' విద్యార్థి

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

మండల పరిధిలోని జగరాజుపల్లి మంగళకర విద్యా సంస్థలలో బీకాం చదువుతున్న సాయి కుమార్ అనే విద్యార్థి సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యాడు. కేరళలోని తిరువనంతపురంలో యూని వర్సిటీ ఆఫ్ కేరళ జరగబోవు పోటీలలో ఈ విద్యార్థి ఎస్కే యూనివర్సిటీ జట్టు తరపున ఆడనున్నారు. ఈ విద్యార్థి ఎంపిక పట్ల మంగళకర విద్యాసంస్థల మేనేజింగ్ ట్రస్టీ కే సురేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్య ప్రకాష్, ఏవో జయచంద్ర రెడ్డి, మంగళకర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు, పీడీ శ్రీనివాసులు తదితరులు అభినందించారు.



సాయికుమార్

## విఒఎ మండల అధ్యక్ష ఎన్నికను రద్దు చేయాలని వినతి

**ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్**

కొత్తచెరువు మండలంలో జరిగిన విఒఎ ఎన్నికను రద్దు చేయాలని సిఐటియు నాయకులు, ఎరుకుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం పుట్టపర్తి పట్టణంలోని డిఆర్‌డిఎ కార్యాలయంలో పీడీ నరసయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎరుకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగులప్ప, నాయకులు నాగమణి, లక్ష్మీదేవి, కష్ణవేణి, అశ్విని, తులసి లక్ష్మి, సిఐటియు నాయకులు ఇఎస్ వెంకటేష్ పాల్గొన్నారు.





పీడీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## వేరుశనగ సాగుపై అవగాహన

**ప్రజాశక్తి - తాడిమర్రి**

మండల పరిధిలోని ఏకపాదంపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు వేరుశనగ పంట పొలాలను సందర్శించి పంటసాగులో తీసుకోవాల్సిన మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎవో రమాదేవి, విఎస్ఎ నాగేంద్ర, ఎంపిఇఒ విజయ, రైతులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళా

**ప్రజాశక్తి - ధర్మవరం టౌన్**

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ,జిల్లా ఎంప్లాయిమెంట్ సిడాప్ సంయుక్త చైర్మన్ దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళాను నిర్వహించినట్లు మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ బాబు తెలిపారు. ఈ జాబ్ మేళాకి మూడు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు. 41 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించగా 18 మంది వివిధ కంపెనీలకు ఎంపిక అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జెవి. సురేష్ బాబు, నైపుణ్యాభివృద్ధి ప్లేస్మెంట్ అధికారి తేజ కుమార్, సిడాపు డిపిటిఎమ్ నారాయణ, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సిబ్బంది, సిడాపు సిబ్బంది, ఎంప్లాయ్‌మెంట్ అధికారులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సుస్థిర సమగ్రాభివృద్ధిపై శిక్షణ

**ప్రజాశక్తి -ధర్మవరం రూరల్**

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామాల్లో సుస్థిర సమగ్ర అభివృద్ధిపై చేపట్టిన శిక్షణ తరగతులు రెండోరోజు మంగళవారం కొనసాగాయి. శ్రీకాళహస్తి ఇటిసి వైస్ ప్రిన్సిపల్, అబ్జార్వర్ రూపా రాణి ఈ శిక్షణ తరగతులను పరిశీలించారు. శిక్షణ కార్యక్రమం గురించి వివరాలు తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, సర్వేయర్లు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## బుక్కపట్నం చెరువు సంఘం ఉపాధ్యక్షులుగా దేవిశెట్టి సంజీవ రాయుడు

**ప్రజాశక్తి - బుక్కపట్నం**

జిల్లాలోనే అతిపెద్ద చెరువు అయిన బుక్కపట్నం చెరువు సంఘం ఎన్నికలు శనివారం జరగగా చెరువు సంఘము ఉపాధ్యక్షుడిగా దేవిశెట్టి సంజీవ రాయుడును ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అండగా ఉంటూ రైతు సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి, జనసేన ఇన్చార్జి పత్తి చంద్రశేఖర్ కు కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామంలో అధ్యక్షుడు,డైరెక్టర్లతో కలిసి కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## దుప్పట్లు పంపిణీ

**ప్రజాశక్తి - ధర్మవరం టౌన్**

పట్టణంలోని గాంధీ నగర్‌లో గల శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో 60 మందికి దుప్పట్లను పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి వారు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అన్న సూక్తితో తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి సేవా సమితి నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఖాతాదారులకు మెరుగైన సేవలు

**ప్రజాశక్తి - బుక్కపట్నం**

గ్రామీణ ప్రాంత ప్రజలకు కెనరా బ్యాంక్ ద్వారా మెరుగైన సేవలు అందించడమే తమ ముఖ్య ఉద్దేశమని కెనరా బ్యాంక్ కడప రీజినల్ మేనేజర్ మురళీమోహన్ తెలిపారు. మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో మంగళవారం కెనరా బ్యాంక్ ఎటిఎంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కెనరా బ్యాంక్ ద్వారా మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని, ఖాతాదారులకు బ్యాంకు లావాదేవీలకు ఇబ్బంది కలగకుండా ఎటిఎం ద్వారా లావాదేవీలు సులభంగా జరుపుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం బ్యాంకు ద్వారా మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సంజయ్, సిబ్బంది వనిత, గోవిందప్ప, టిడిపి నాయకులు గంగాధర్, మాజీ నారాయణస్వామి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన

**ప్రజాశక్తి - రొద్దం**

టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని నల్లూరు గ్రామంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంత శక్తి సొసైటీ ఆధ్వర్యంలో సీఈవో లావణ్య, అధ్యక్షులు సుశీలమ్మ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం సమాజంలో మహిళలపై జరుగుతున్న వివక్షత, హింసపై నాటిక రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, మహాశక్తి నుంచి గౌరీ పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజల్లో రఘువీరారెడ్డి దంపతులు

**మడకశిర రూరల్ :** మండల పరిధిలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి వారిని బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం సిడబ్ల్యూసి సభ్యులు రఘువీరారెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు అంతకుముందు దేవాలయ శాఖ వారిని స్వాగతం పలికింది. ఈ కార్యక్రమంలో మాజీమార్కెట్ యార్డ్ చైర్మన్ గంగలవాయిపాలెం ప్రభాకర్ రెడ్డి, వైబిహళ్లి సోమశేఖర్ రెడ్డి, జిల్లెడుగుంట పాలే నాయక్, టీచర్ వసంత నరసిగౌడ్ తదితరులు ఉన్నారు.

# సాగుదారులకు పట్టాలివ్వండి



అధికారులకు సమస్యను వివరిస్తున్న నాయకులు, బాధితులు

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

మండల కేంద్రంలోని భూమిలేని నిరుపేదలు సాగు చేసుకున్న ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని అదేవిధంగా నక్కలగుట్ట కాలనీలో పునాదులు వేసుకున్న ఇల్లు లేని పేదలకు పట్టాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో తహశీల్దార్ రెడ్డి శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవిన్యూ గ్రామ సభలో కెవిపిఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలోని పందిపర్తి పొలం సర్వేనెంబర్ 384 భూమిలేని నిరుపేదలు సాగు చేసుకుంటున్నారని వీరికి పట్టాదారు మంజూరు చేయాలని పలుమార్లు పేదల ఆధ్వర్యంలో అర్జీలు అందజేశామని చెప్పారు. ఇప్పటికైనా సాగుదారులకు పట్టాదారులు ఇవ్వాలని అదేవిధంగా నక్కలగుట్ట కాలనీలో సర్వేనెంబర్ 744 లో ఇల్లు లేని పేదలు పునాదులు వేశారని వారికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 7 లో దళితుల శ్మశాన వాటికకు మూడు ఎకరాల భూమిని కేటాయించి ప్రహరీ నిర్మించాలన్నారు. మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణంలో నిరుపయోగంగా ఉన్న సామూహిక మరుగుదొడ్లను ప్రయాణికులకు సౌకర్యం వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు బెస్త కిష్టప్ప , కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య , జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశులు, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు రంగప్ప , గంగరాజు , ఆవాజ్ మండల అధ్యక్షులు మాబు , కల్లు గీత కార్మిక సంఘం మండల నాయకులు రామకృష్ణ , లబ్ధిదారులు వరలక్ష్మి, రామాంజనమ్మ, ముంతాజ్, మహేష్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీవారి ఆలయాన్ని కోనేరు లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ కోనేరు అభివృద్ధి పేరుతో గత వైసిపి ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను వృధా చేసిందని విమర్శించారు. తాము శ్రీవారి ఆలయ సంప్రదాయాలు కట్టుబాట్ల భక్తుల అవసరాలు కనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల భక్తులు కోనేరులో పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులకు వీలు లేకుండా పోయిందన్నారు. శ్రీవారి ఆలయ సంప్రదాయాలు కట్టుబాట్లకు అనుగుణంగా కోనేరును పూర్తి చేసి త్వరలోనే భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, ఆలయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన అర్చకులు పార్థసారధి చార్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ అధికారులు, సిబ్బందితో ఎమ్మెల్యే కందికుంట, నాయకులు

# ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



ధర్మవరంలో రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

**ప్రజాశక్తి -ధర్మవరం రూరల్**

స్థానిక ఎన్జీవో హోంలో విశ్రాంతి ఉద్యోగుల దినోత్సవంవానిన పెన్షనర్లసంఘం అధ్యక్షులు చలపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఎటిఒ పద్మనాభం, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ సందీప్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు శంకరనారాయణ, ఐసిఐసిఐ బ్యాంక్ మేనేజర్ నిగోల్, కొత్తపేట ఆంధ్ర ప్రగతి బ్యాంకు మేనేజర్ సువర్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులందరూ పదవి విరమణ తర్వాత ప్రశాంతతతో, ఆరోగ్యంగా జీవించాలన్నారు. పెన్షన్‌దారులకు ట్రెజరీ కార్యాలయంలో కావలసిన సహాయ సహకారాలను తప్పక అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం సైబర్ క్రైమ్ విషయంలో అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.. అనంతరం పదిమంది రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులైన పోతిరెడ్డి, గోవిందరెడ్డి, సరోజినీ, సదాశివరెడ్డి, కంబగిరి ,శివయ్య, నాగరాజు, శ్రీనివాసులు, యజ్జన్న, రామిరెడ్డిను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి నర్సిరెడ్డి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు చెన్నప్ప, కోశాధికారి సుధాకర్ తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

**మడకశిర రూరల్** : జాతీయ పెన్షన్ దారుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ఆమిదాల గొంది శ్రీ వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో సింహగిరి పెన్షనర్స్ అసోసియేషన్ తరపున వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, పక్రుద్దీన్, గణపతి, శాంతవీరప్ప, రాజారావు, రిటైర్డ్ ఎంఇఒ అశ్వర్థామ, సుబ్రహ్మణ్య తదితరులు పాల్గొన్నారు.

**కొత్తచెరువు :** కొత్త చెరువులోనే దర్గా లోనే పెన్షనర్ల భవనంలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సన్మాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. 80 సంవత్సరాలు పైబడిన ఉద్యోగులు ఏడుగురికి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు అందుకున్న ముగ్గురు రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకటరత్నం, అబ్దుల్ రహమాన్, చెన్నకృష్ణారెడ్డికి శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణయ్య, రిటైర్డ్ హెచ్ఎం వెంగన్న, రిటైర్డ్ ఉద్యోగులు గఫూర్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యనందించడమే ఎల్ఆర్‌జి లక్ష్యం





సమావేశంలో మాట్లాడుతున్న నిఖిల్ గోవింద్ రామమూర్తి



ఆడిటోరియంను ప్రారంభిస్తున్న దృశ్యం

### ఘనంగా పాఠశాల ఫౌండర్స్ డే వేడుకలు

**ప్రజాశక్తి-హిందూపురం**

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఎల్ఆర్‌జి విద్యాసంస్థలను స్థాపించినట్లు విద్యా సంస్థల డైరెక్టర్, ప్రముఖ వ్యాపార వేత్త నిఖిల్ గోవింద్ రామ మూర్తి అన్నారు. హిందూపురం రూరల్ మండలం కిరికెర వద్ద ఉన్న ఎల్ఆర్‌జి విద్యా సంస్థల్లో మంగళవారం ఫౌండర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ముఖ్యఅథితులు ఎన్‌సిసి విద్యార్థులతో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం నూతనంగా నిర్మాణం చేసిన ఆడిటోరియంను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నిఖిల్ గోవింద్ రామమూర్తి, వ్యాపార వేత్త సిద్దారెడ్డి, విద్యాసంస్థల సెక్రేటరి బాలసుందరం మాట్లాడారు. నైతిక విలువలతో కూడిన విద్య విద్యార్థుల భవిష్యత్తును బంగారు మయం చేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ విద్యాసంస్థల్లో చదివిన ఎంతో మంది విద్యార్థులు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఎల్ఆర్‌జి సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని విద్యాసంస్థలను స్థాపించి, తక్కువ ఫీజులతో ఈ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. అనంతరం విద్యతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు మెమోంటోలు, మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఎఒ సంజీవ రెడ్డి, ఎల్ఆర్‌జి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకట్రామిరెడ్డి, పబ్లిక్ స్కూల్ హెచ్ఎం భారతి, ఎహెచ్ఎం సుధ, ఉపాధ్యాయులు విజయ్, హరినాథ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సి మోడల్ పేపర్లు విడుదల

**ప్రజాశక్తి -ధర్మవరం టౌన్**

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది పదవ తరగతి విద్యార్థుల కోసం రూపొందించే పదో తరగతి పరీక్ష మోడల్ పేపర్లను మంగళవారం ధర్మవరం ఎంఆర్‌సిలో ఆవిష్కరించారు. ఎంఇఒలు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రా రెడ్డి వీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట మునిసిపల్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరి వరకుమారి, యుటిఎఫ్ ధర్మవరం పట్టణ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరికృష్ణ, సాయి గణేష్, సీనియర్ నాయకులు రామకృష్ణ నాయక్, లక్ష్మయ్య, లతాదేవి, నాగేంద్రమ్మ, వీర నారాయణమ్మ, విజయలక్ష్మి, రామాంజినేయులు, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**ఓబుళదేవర చెరువు :** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది పదవ తరగతి విద్యార్థుల కోసం రూపొందించే ఎస్ఎస్‌సి మోడల్ పేపర్లను మంగళవారం విడుదల చేశారు. తంగేడు కుంట జిల్లా పరిషత్ హై స్కూల్లో ఉపాధ్యాయుడు జనార్ధన డొనేట్ చేసిన యు టి ఎఫ్ ప్రచురించిన మోడల్ పేపర్లను విద్యార్థులు, విద్యార్థినిలకు యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు మనోహర, బాలాజీ నాయక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తంగేడుకుంట ఉపాధ్యాయులు కలిముల్లా, సుధాకర్ రెడ్డి, మనోహర్ శ్రీనివాస్ నాయక్, శివ శంకర్, ఎల్లప్ప, జనార్ధన్, లక్ష్మి దేవి, చంద్రకళ, తిరుపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**కదిరి టౌన్ :** యుటిఎఫ్ రూపొందించబడిన పదవ తరగతి మోడల్ మెటీరియల్‌ను స్థానిక కస్తూరిబా గాంధీ పాఠశాలలో 40 మంది విద్యార్థులకు దాత టీచర్ చలపతి సహకారంతో ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు డి. శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణగా విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై వి సుబ్బారెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యులు ఆజంబాష, మల్లికార్జున, కెజిబివి ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





ధర్మవరంలో మోడల్‌పేపర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు



ఓడిసిలో మోడల్‌పేపర్లతో విద్యార్థులు



కదిరిలో మోడల్‌పేపర్లతో విద్యార్థులు

## వందేభారత్ రైలు ఢీకొని 40 గొర్రెలు మృతి

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

ధర్మవరం మండలం బడన్నపల్లి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం వందేభారత్ రైలు ఢీకొని 40 గొర్రెలు మరణించాయి. ఇందుకు సంబంధించి బాధిత గొర్రెల కాపరులు దాసరి శివయ్య, మల్లీశ్వరి దంపతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దాసరి శివయ్యకు 150 గొర్రెలు ఉన్నాయి. సొంత పని నిమిత్తం శివయ్య వేరే ఊరికి వెళ్లగా ఆయన భార్య గొర్రెలను మేత కోసం బడన్నపల్లి రైల్వే ట్రాక్ సమీపంలోకి తీసుకెళ్లింది. గొర్రెలను ట్రాక్ అటు వైపునకు తరలిస్తుండగా అదే సమయంలో వందేభారత్ రైలు బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు దూసుకొచ్చింది. రైలు శబ్దంకి బెదిరిపోయిన గొర్రెలు గుంపులు గుంపులుగా ట్రాక్‌పైకి వెళ్లాయి. దీంతో రైలు గొర్రెలను ఢీకొని వెళ్లింది. ఈ సంఘటనలో 40 గొర్రెలు మరణించాయి. మరికొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. ఈ విషయాన్నీ తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకుని తీవ్రంగా నష్ట పోయిన బాధిత రైతును ఓదార్చారు. నష్టపోయిన గొర్రెల యజమానిని ప్రభుత్వం ఆదుకోవాలని తోటి గొర్రెల కాపరులు కోరారు

## గడ్డివామి దగ్ధం

**ప్రజాశక్తి - లేపాక్షి**

మండల పరిధిలోని బసనపల్లికి రైతుకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. గ్రామంలోనినారాయణ స్వామికి చెందిన రేషన్ షెడ్డుకు వెనుకవైపు ఉన్న నాలుగు ట్రాక్టర్ల గడ్డి వామికి మంగళవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయాయి. గమనించిన స్థానికులు మంటలను అరపడానికి ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆవుల కోసం నిలువ ఉంచుకొన్న గడ్డి కాలి పోవడంతో రైతు లబోదిబో మంటున్నాడు. బాధిత రైతులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పోలీసుల తనిఖీలు

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మంగళవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీలు చేపట్టిన పోలీసులు రోడ్డు భద్రతలో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలు నడిపే వారికి జరిమానా విధించారు.

## గుండెపోటుతో కార్మికుడు మృతి

**ప్రజాశక్తి - తాడిమర్రి**

మండల పరిధిలోని చిల్ల కొండయ్య పల్లి గ్రామానికి చెందిన కార్మికుడు రాగే కుళ్లాయప్ప (47) గుండెపోటుతో మృతిచెందాడు. కుళ్లాయప్ప కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అందులో భాగంగా ఈ కార్యక్రమంలో భాగంగానే సోమవారం మండల కేంద్రంలోని ఒక చికెన్ సెంటర్‌లో కూలి పని ముగించుకొని గ్రామానికి చేరుకున్నాడు. ఇంట్లో సోమవారం రాత్రి అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను గ్రామంలోని ఒక వైద్యుని వద్దకు చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. అయితే కుళ్లాయప్ప అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యుడు ధ్రువీకరించాడు. కుటుంబం ఆయన మీదే ఆధారపడి జీవించేది. ఇంటి పెద్ద దిక్కు మృతితో ఆ పేద కుటుంబం రోడ్డున పడింది. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతుడికి భార్య సులోచన, కుమార్తె రూప, కుమారుడు రాజేష్ ఉన్నారు.

## రొద్దంలో రైతు...

**ప్రజాశక్తి - రొద్దం**

మండలంలోని బొమ్మిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన రైతు రామాంజినరెడ్డి (52) మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. మంగళవారం తన సొంత పొలంలో వరి మడి కోసం అదును చేస్తున్న సమయంలో ఉన్నఫలంగా వెనక్కుపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

## చెక్ డ్యామ్ మరమ్మతుకు చర్యలు

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

బత్తలపల్లి చెరువులో ధ్వంసమైన చెక్ డ్యామును ఇరిగేషన్ డిఇ మహేశ్వర్ రెడ్డి, ఎఇ భవ్య మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మరమ్మతులకు వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. బత్తలపల్లి చెరువుకు పీఏబిఆర్ కుడి కాలువ నుండి నీరు రానున్న నేపథ్యములో దెబ్బతిన్న చెక్ డ్యామ్ను పరిశీలించి మరమ్మత్తు చేయడానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో క్లస్టర్ ఇన్‌ఛార్జి నెట్టెం రమణ, బత్తల మనోజ్, గుండుసాబ్, సాకే కృష్ణయ్య, యర్రప్ప, చిదంబర్ రెడ్డి, మైకు వన్నూరుప్ప, దురగమప్ప తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి ఆర్థికసాయం

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

మండలంలోని నల్లబొమ్మనపల్లిలో కిడ్నీ వ్యాదితో బాదపడుతున్న కొలిమి అశ్వర్థప్పను టిడిపి నాయకులు మంగళవారం పరామర్శించారు, అశ్వర్థప్ప వైద్య ఖర్చుల నిమిత్తం 10 వేలు ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, రాష్ట కార్యదర్శి అంజినప్ప,ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ గంగాధర్, సీనియర్ నాయకులు బయపరెడ్డి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వెటర్లు పంపిణీ

**ప్రజాశక్తి - గోరంట్ల**

మండలంలోని ఎంఆర్‌సికార్యాలయం నందు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాతలు మంగళవారం అనాథ పిల్లలకు స్వెటర్లు పంపిణీ చేశారు. దాతలు రఘునాథ్ బాబు, వరలక్ష్మి, లక్ష్మీకాంతమ్మ, రాజేశ్వరి, హైమావతి వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు రాజేష్, కోశాధికారి దస్తగిరి, నాగరాజు, గిరిధర్ గౌడ్, ఎంఇఒ జాన్‌రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యల పరిష్కారానికే 'రెవెన్యూ సదస్సులు'

**ప్రజాశక్తి- బత్తలపల్లి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తాహశీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు.మంగళవారం మండలంలోని గరిశనపల్లి రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దారు స్వర్ణలత మాట్లాడుతూ ఆయా గ్రామాలలో నిర్వహించే రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ రెవెన్యూ సదస్సులో జిల్లా పౌరసరఫరాల అధికారి వంశిక్రిష్ణారెడ్డి, సర్పంచి పద్మావతి, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారిణి నాగరత్నమ్మ, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, గ్రామ రెవిన్యూ అధికారులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

**గాండ్లపెంట :** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బాబురావు కోరారు. మంగళవారం మండల పరిధిలోని వేపరాల పంచాయతీలో రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ రెవెన్యూ సదస్సులో సీనియర్ అసిస్టెంట్ జాఫర్, విఆర్ఒ చంద్రశేఖర్ రెడ్డి సర్వేయర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**లేపాక్షి :** మండల పరిధిలోని కంచిసముద్రం పంచాయతీ కేంద్రంలో మంగళవారం రెవిన్యూ సదస్సును నిర్వహించారు. తహశీల్దార్ సౌజన్య లక్ష్మి మాట్లాడుతూ రెవిన్యూ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఆర్ఐ ప్రమీలమ్మ, విఆర్ఒ గంగరత్నమ్మ, సర్వేయర్ త్రివేణి, నాయకులు రాము, నాగరాజు, శంకర్ రెడ్డి, గంగాధరప్ప ప్రజలు పాల్గొన్నారు.

**నంబులపూలకుంట :** మండల పరిధిలోని పెడబల్లిలో తహశీల్దార్ దేవేంద్ర నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భూ సమస్యపై వివాదాలు నెలకొన్న రైతులు ఈ సదస్సులో అర్జీలు సమర్పించుకుంటే వారికి న్యాయం చేస్తామన్నారు. ఈ సమావేశంలో సర్పంచి శ్రీహరి శర్మ, వీఆర్వో రఘునాథ్, రెవెన్యూ సిబ్బంది, మాజీ ఎంపిటిసి రామాంజులు, అల్లాబకష్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

**అగళి:** మండలం లోని కోడిపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సులో నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధిలో సంబంధించి భూముల తగాదాలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్బారావు, ఆర్ఐ చంద్రశేఖర్, సర్పంచి రఘునాథ్, రైతులు పాల్గొన్నారు.

**చిలమత్తూరు :** టేకులోడు ప్రాంతంలో పరిశ్రమల కోసం రైతుల వద్ద తీసుకునే భూములకి మంచి నష్టపరిహారం ఇవ్వాలని టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి,ఎస్సీ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బేకరీ గంగాధర్ కోరారు. ఈ మేరకు టేకులోడులో మంగళ వారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టేకులోడు ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. అయితే ఏపిఐఐసి పరిశ్రమల ఏర్పాటు కోసం రైతుల నుండి సేకరించే భూములకు అదికారులు మంచి ధరను నిర్ణయించి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యూనస్ బాబు, మండల సర్వేయర్ కోదండపాణి, రెవెన్యూ సిబ్బందితో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి అంజినప్ప, సీనియర్ నాయకులు బయపరెడ్డి, సర్పంచి సరోజమ్మ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.